మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# పోలింగ్ ప్రశాంతం..!

- ముగిసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక
- 99.86పోలింగ్ శాతం నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న 1437 మంది ఓటర్లు
- ఉమ్మడి జిల్లాలో 10పోలింగ్ కేంద్రాలు..
- కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటేసిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు
- బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28, ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎంపీలు 2, 3 ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు 14, జెడ్పీటీసీలు 83,కౌన్సిలర్లు 449, ఎంపీటీసీలు 888 కలిపి మొత్తం 1439మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 10పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 1439మంది ఓటర్లకు 1437 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 245ఓట్లు, వనపర్తిలో 218ఓట్లు, గద్వాల జిల్లాలో 225ఓట్లు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 319ఓట్లు, నారాయణపేటలో 205ఓట్లు ఉన్నాయి.



కొడంగల్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాలో వందశాతం పోలింగ్ కాగా, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో ఒక్కో ఓటు చొప్పున వినియోగించుకోకపోవడంతో 99.86 పోలింగ్ శాతం నమోదైంది. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగియడంతో బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం ఉన్నది. ఉమ్మడి జిల్లా ఓట్ల లెక్కింపునకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో కౌటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈమేరకు కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి రవినాయక్, ఎన్నికల పరిశీలకురాలు వాణీ ప్రసాద్ తెలిపారు. అయితే ఎమ్మెల్సీ ముగ్గురు అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి అభ్యర్థి నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తున్నది. నారాయణపేట జిల్లా కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి మహబూబ్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి,జి మధుసూదన్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డితో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఉదయం 11గంటల వరకు మందకొడిగా సాగిన పోలింగ్ 12 తర్వాత 50శాతానికిపైగా చేరుకున్నది. మహబూబ్‌నగర్‌లో ఉదయం 11గంటల వరకు 11.020 శాతం, 12గంటలకు 53.87శాతం, మధ్యాహ్నం 2గంటల తర్వాత 93.46శాతం నమోదైంది. దాదాపు ఉమ్మడి జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్లలో ఇదే పరిస్థితి నెలకొన్నది. ఉమ్మడి పాలమూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలువడంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 2న జరగనున్నది.



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జి రవినాయక్

| పోలింగ్ కేంద్రం | పోలైన ఓట్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 245 | 245 |
| నారాయణపేట | 204 | 205 |
| జోగులాంబగద్వాల | 225 | 225 |
| వనపర్తి | 218 | 218 |
| కొల్లాపూర్ | 67 | 67 |
| అచ్చంపేట | 79 | 79 |
| కల్వకుర్తి | 72 | 72 |
| నాగర్‌కర్నూల్ | 100 | 101 |
| షాద్‌నగర్ | 171 | 171 |
| కొడంగల్ | 55 | 56 |
| మొత్తం | 1437 | 1439 |

### గెలుపు తథ్యం... గెలుపు మీదే ఆశలు

**మెజార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి**



ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని, మెజార్టీ మీదే తమచూపు ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన సందర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎన్నికల పరిశీలకురాలు రవినాయక్, వాణిదేవిలు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించారని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో విజయం సాధించి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### మాదే విజయం...

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**
**స్థానిక సంస్థల బలోపేతానికి కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉంది**
**ఫోన్ ట్యాపింగ్‌లతో భయభ్రాంతులకు గురి చేసింద్రు**



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపిటిసిలను కనీసం మనుషులుగా కూడా గౌరవించలేదని, వారు ప్రజల చేత ఎన్నుకున్న నాయకులు అన్న విషయాన్ని కూడా గుర్తించలేని స్థితిలో వారు ఇన్నాళ్లు ఉన్నారని, కానీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ సభలో స్థానిక సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక సంస్థలు పటిష్టంగా తయారు చేసినప్పుడే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని, స్థానికసంస్థల బలోపేతానికి కృతనిశ్చయంతో ఉన్నామని మహబూబ్‌నగర్ బహిరంగ సభలో స్పష్టం చేశారని ఆయన గుర్తు చేశారు. ఎంపిటిసిలు కేవలం ప్రజల చేత ఎన్నుకోబడిన వారిగా మాత్రమే గుర్తింపు ఉందని వారు ప్రజలకు ఏ విధమైన సంక్షేమ ఫలాలు అందించలేని దుర్లభమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎంపిటిసిల ఆత్మగౌరవం పెంపొందించే విధంగా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు – మిగతా4లో..



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో ఎమ్మెల్యేలు యెన్నం, జిఎంఆర్, ఎమ్మెల్సీ అభ్యర్థితో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఏ తిరుపతిరెడ్డి



ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లు



ఓటు వేసేందుకు క్యూలో కూర్చున్న ఓటర్లు



ఓటు వేసేందుకు క్యూలో నిలబడ్డ ఓటర్లు

## ఇసుక రవాణాకు గేట్లు తెరిచారు..!

**జిల్లా ఘణపురం మార్చి 28 ప్రభాతవార్త :** ఇసుక రవాణా కాంట్రాక్టర్లకు అధికారులు గేట్లు తెరిచారు. నిరుపేదల గృహాలకు మాత్రం మొండి చేయి చూపారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని అంతాయపల్లి వాగు నుండి ప్రభుత్వ పనులకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం ఇసుక వారిని గుర్తించింది. ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ భూముల్లో ఇసుక అయిపోవడంతో ఇసుక రవాణాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి దీంతో మండల కేంద్రానికి సమీపంలో ఉన్న మలుపు మియాన్ పల్లి శివారులో పిల్ల వాగులో గత నెలలో సిసి రోడ్ల నిర్మాణం పేరుతో రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడంతో మధ్య దళారులు రోజుకు వందల సంఖ్యలో ఇసుకను తరలించారు.సిసి రోడ్లకు అనుమతులు ముగియడంతో కాంట్రాక్టర్లకు ఇసుక తరలింపుకు అనుమతులు ఇచ్చారు ఒకరు డబల్ బెడ్ రూమ్ పేరుతో ఇసుకను తరలిస్తే మరొకరు వాలాద్రి వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం వందల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు ఘణపురం నుండి మహబూబ్‌నగర్ కు వెళ్లి బీటీ రోడ్డు నుండి దాదాపు కిలోమీటర్ కు పైగా హిటాచీలు జెసిబిల సహాయంతో ఇసుకను తరలించారు పుల్లి వాగు సమీపంలో ఉన్న గ్రామాల వారికి గృహ నిర్మాణం కోసం అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు తమసొంత పొలంలో ఇసుక నుండి ఇంటి నిర్మాణం కోసం ఇసుకను తీసుకోలేకపోతున్నామని ఇక్కడి నుండి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ లో ప్రభుత్వ పనులకు మాత్రం ఇసుక తరలింపుకు రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వడం బాధాకరమన్నారు.నిరుపేదల ఇండ్లు నిర్మాణం చేసుకోవడం కోసం మీ సేవలో ఒక్కో ట్రిప్పు ట్రాక్టర్ కు 2500 రూపాయలు చెల్లించి ఏడాది గడుస్తున్న ఇసుక మాత్రం ఇంతవరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామాలలో ప్రభుత్వ పనులు నిర్మాణం చేసుకునే వారిక ఉచితంగా ఇసుక రవాణా అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చి వారం రోజులు గడుస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం తమకు ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదని దాటవేస్తున్నారని చెప్పారు జిల్లా స్థాయి అధికారులు ఇకనైనా పట్టించుకుని గ్రామాలలో గృహాలు నిర్మించుకునే వారికి ఇసుక రవాణాకు అనుమతించాలని కోరారు.



ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

## ప్రశాంతంగా ముగిసిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎలక్షన్..

**వనపర్తి ప్రతినిధి,మార్చ్ 28,ప్రభాత వార్త :** వనపర్తి జిల్లాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎలక్షన్ ప్రశాంతంగా సాయంత్రం 4 గంటలకు ముగిసింది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పగడ్బందిగా కట్టుదిట్టమైన భద్రతతో ఆర్డిఓ కార్యాలయంలో అన్ని ఏర్పాటులు చేసి ఎలక్షన్ లో పాల్గొన్న 14 మండలాలు సంబంధించిన ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా పాసులు జారీ చేసి వారి ఓటును వినియోగించే విధంగా అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకున్నారు.పోలింగ్ స్టేషన్ నెంబర్ 4 లోని ఉండే మొత్తం ఓటర్ల సంఖ్య 218 ఇందులోని 99 మంది పురుషులు అభ్యర్థులు 119 మంది మహిళలు అభ్యర్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి వనపర్తి ఆర్డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ నెంబర్ 4 ఓటు హక్కు వినియోగించుకున్నారు.వారితోపాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కౌన్సిలర్లు,ఎంపీటీసీ,జడ్పిటిసిలు,వచ్చి ఓటు వేసినారు.ఈ యొక్క ఎలక్షన్లలో చివరి నిమిషంలో అంబడబాకుల ఎంపీటీసీ శశి రెడ్డి పరుగులు పెట్టుకుంటూ వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.ఎన్నికల సరళిలీని జిల్లా కలెక్టర్,అడిషనల్ కలెక్టర్,జిల్లా ఎస్పీ ఆర్డిఓ,రెవెన్యూ మున్సిపల్ అధికారులు ఈ యొక్క ఎన్నికల విధులులో పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

## ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక..

**ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు**

**ఇటిక్యాల,మార్చి 28 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నిక అలంపూర్ నియోజకవర్గం, గద్వాల నియోజకవర్గానికి సంబంధించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు 225 ఓటర్లుగా ఉండగా అందరూ ప్రజా ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొని 100 శాతం ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గం.ల నుండి సాయంత్రం 4 గం. వరకు స్థానిక సంస్థల ఉప ఎన్నిక కొనసాగింది. ఈ స్థానిక సంస్థల ఉప ఎన్నికను ఇటు అధికార కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, జడ్పీ ఛైర్మన్ సరిత తిరుపతయ్య, ఏఐసిసి కార్యదర్శి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, అటు బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొని 2019 ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ గెలుపొందిన జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన కౌన్సిలర్లు, ఎంపిటిసిలను చేజారకుండా ఉండేందుకు రెండు పార్టీలు కూడా వారం రోజులుగా గోవా, కర్ణాటక, ఊటీ, కొడైకెనాల్ వంటి ప్రాంతాకు తరలించి చేజారకుండా ప్రజా ప్రతినిధులను కాపాడుకున్నారు. గురువారం స్థానిక సంస్థల ఉప ఎన్నికల జరుగుతుండగా క్యాంపులకు వెళ్లిన ప్రజా ప్రతినిధులను బస్సులలో వాహనాలలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను ఓటింగ్ జరిగే కేంద్రానికి ఆయా పార్టీల నాయకులు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి 12 మంది జడ్పీటిసిలు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు సైతం వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఓట్లతో కలిపి మొత్తం 118 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఓటర్లు అలాగే గద్వాల నియోజకవర్గంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జడ్పీటిసిలు, కౌన్సిలర్లు, ఎంపిటిసిలతో కలిపి 107 మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో మొత్తం 255 మంది ప్రజాప్రతినిధులు, ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. స్థానిక సంస్థల ఉప ఎన్నిక సందర్భంగా ఎటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు గాను జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్, జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశాలతో పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నిక ఎటువంటి ఘటనలు జరగకుండా ప్రశాంతంగా కొనసాగింది.



పోలింగ్ కేంద్రం వద్ద స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు

## బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల,మార్చి 28 ప్రభాతవార్త :** మండ లంలోని మామిళ్లపల్లి లక్ష్మినరసింహస్వామి బ్ర హ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా గురు వారం అంతరాష్ట్ర వృషభరాజుల బండలాగుడు పోటీలను అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీ కృష్ణ ప్రారంభించారు. అనంతరం పోటీలు పూర్తయ్యేంతవరకు ఆలయ ప్రాంగణంలో జరు గుతున్న పోటీలను ఆయన తిలకించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు నగదు ప్రో త్సాహం అందజేశారు. కార్యక్రమంలో అచ్చం పేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణతో పా టు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, ఎంపిపి తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, జడ్పీటిసి అనంతప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసిలు గోపిరెడ్డి అనురాధరెడ్డి, కడారి రామలక్ష్మమ్మ, ఆలయ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఈఓ నాగరాజు,పాలకమండలి సభ్యులు,మాజీఛైర్మన్ చెల్లమలరామస్వామిగౌడ్,దాసర్లపల్లి నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నరసింహారావు, మాజీ సర్పంచ్ మర్యాద దామోదర్, వివిధ గ్రామాల నుంచి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు.



పోటీలు ప్రారంభిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

**ముగిసిన బ్రహ్మోత్సవాలు...**

మామిళ్లపల్లి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో జరిగిన బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. రోజువారి కార్యక్రమాలు చేపడుతూ కళ్యాణ మహోత్సవం, రథోత్సవం తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమాలు తిలకించేందుకు అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, సిబిఎం ట్రస్టు ఛైర్‌పర్సన్, అమ్రాబాద్ జడ్పీటిసి డా.చిక్కుడు అనురాధ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి ఆలయ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, శ్రీనివాస్‌రావు, పాలక మండలి సభ్యులు, గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందించారని ఈఓ శ్రీనిసరావు తెలిపారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటి ఛైర్మన్ కందూరు సుధాకర్, ఎద్దుల నరేష్‌యాదవ్‌ల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, హైదరాబాద్ వారిచే ఈవెంట్స్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

## స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపు ఖాయం

**ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**



ఓటు వేసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి గెలవడం ఖాయమని గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఎమ? గద్వాల జిల్లా కేంద్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తన ఓటు హక్కును జడ్పీకార్యాలయం సమావేశం మందిరంలో వినియోగించుకున్నారు. ఎన్నికల కేంద్రంలో జరుగుతున్న ఓటింగు సందర్భంగా తన ఓటు వేశారు. ఖచ్చితంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్ రెడ్డి గెలుపు ఖాయమన్నారు. ఎమ్మెల్యే వెంటనే ప్రజాప్రతినిధులు, ఎంపీపీ ప్రతాప్ గౌడ్ , కౌన్సిలర్స్ మురళి, నాగిరెడ్డి, నరహరి, శ్రీనివాస్‌లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సదస్సులో బిఆర్ఆర్ విద్యార్థులు..

**ప్రథమ బహుమతి పొందిన విద్యార్థి రాహుల్**



బహుమతి అందుకుంటున్న విద్యార్థితో అసోసియేట్ ప్రొ॥ సదాశివయ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 28 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిద్ధిపేటలో జరుగుతున్న రెండు రోజుల జీవవైవిధ్య పరిరక్షణలో ఇటీవలి పోకడలు అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సులో వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డా. సదాశివయ్య ప్రత్యేక – మిగతా2లో..

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామి ఉత్సవం..

**- సాంప్రదాయరీతిలో పూజలు**



**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** మన్యం కొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అనుబంద దేవలయమైన శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామి దేవస్థానంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అలివేలుమంగతాయారు బ్రహ్మోత్సవాలను ముగిసిన తరువాత రాయచూర్ అంతరాష్ట్ర రహదారి పక్కనున్న మైసమ్మ దేవాలయం సమీపంలో కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామివారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పూజలను దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ పూజలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్బంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్అళహరి మధుసూధన్‌కుమార్,అళహరిరామకృష్ణలతో పాటు ఈఓ శ్రీనివాసరాజు,ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద యువతి పెళ్ళికి పుస్తెమెట్టలు అందజేసిన జీకేఆర్ ఫౌండేషన్



**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** ఓ నిరుపేద యువతి పెళ్ళికి జీకేఆర్ ఫౌండేషన్ గురువారం పుస్తెమెట్టలు అందజేసింది. దేవరకద్ర మండలం అడవిఅజిలాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన గొల్ల పాలమూరి ఉదండి,సత్యవతి దంపతుల కూతురు హారిక వివాహం సందర్బంగా జీకేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కోన రాజశేఖర్ ఆ పెళ్ళికి హాజరై పుస్తెమెట్టలను అందజేశారు.దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి ఆదేశానుసారం తనవంతు ఈ సహాయాన్ని అందజేసినట్లు కోన రాజశేఖర్ తెలిపారు.ఈ విదంగా జీకేఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కోన రాజశేఖర్ గతంలో కూడ ఎన్నో నిరుపేద వివాహాలకు తన వంతు సహకారాన్ని అందజేసి అందరి అభిమాలను పొందారు.అందులో భాగంగానే ఇప్పుడు కూడ అడవిఅజిలాపూర్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన ఓ యువతి వివాహనికి కూడ తమ సహకారాన్ని అందజేసి గ్రామస్థుల మన్ననలు పొందారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు చిన్నయ్య,వెంకటేష్,రాజుగౌడ్,విష్ణుచారి, జగన్నాథ్‌రెడ్డి,వన్నాడరాజు,గోపాల్,రామచంద్రయ్య,రాజు,నరసింహ్ములు,రాజేశ్,కేశవులు,గొల్ల అంజనేయులు,మాదేని అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి విజయం ఖాయం

**జెడ్పిచైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల ఇంచార్జీ సరితమ్మ**



**గద్వాల ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని జడ్పిచైర్మన్ సరిత మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌లు అన్నారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పి చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జి సరిత మున్సిపల్ చైర్మన్ బి.ఎస్.కేశవ్‌తో కలిసి కౌన్సిలర్లు, ఎంపిటిసిలు జెడ్పి కార్యాలయం సమావేశం మందిరంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో సరిత మాట్లాడుతూ ఖచ్చితంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మన్నే జీవన్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. జెడ్పిచైర్ పర్సన్ వెంట కౌన్సిలర్లు, శ్రీనివాసులు, కోటేశ్, శ్వేత, కృష్ణ, ఇశాక్, శంకర్, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అసిస్‌మెంట్ చేసుకోకుండా ఆస్తి పన్ను చెల్లించని కమర్షియల్ భవనాల పరిశీలన

**-మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్**



**కల్వకుర్తి, మార్చి 28 ప్రభాతవార్త:**కల్వకుర్తి మున్సిపల్ పరిధిలో నిర్మాణం చేసుకొని అసిస్‌మెంట్ చేయించుకోకుండా ఆస్తి పన్ను చెల్లించకుండా ఉన్న కమర్షియల్ భవనాలు ఫంక్షన్‌హాల్, రైస్ మిల్లులు, పెట్రోల్ పంపులు వంటి వాటిని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ పరిశీలించారు. ఆస్తి పన్ను చెల్లించని వాటిపై చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని కుర్మిద్ద రోడ్డులో రాయల్ ఫంక్షన్‌హాల్‌కు అసిస్‌మెంట్ చేయించుకోనందున అట్టి ఫంక్షన్‌హాల్‌కు తాళం వేశారు. అదే విధంగా అసిస్‌మెంట్ చేయించుకొని భవనాలకు తప్పనిసరిగా కార్యాలయంలో డాక్యుమెంట్స్ సమర్పించి అసిస్‌మెంట్ చెల్లించాలని కోరారు. అదే విధంగా పట్టణ పరిధిలో బకాయిలు ఉన్న ఆస్తి పన్ను వెంటనే చెల్లించాలని, ప్రస్తుతం ఆస్తి పన్ను జరిమానాపై 90శాతం రాయితీ ఉన్నందున ఈ అవకాశం ఈనెల 31మార్చితో ముగుస్తుందన్నారు.ఈఅవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ రాజకుమారి,ఆర్ఐ చంద్రయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కళాకారులకు ఘన సన్మానం..



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:** అంతరించిపోతున్న పౌరాణిక నాటక రంగానికి పూర్వవైభవం తీసుకొని రావడానికి ప్రేక్షకుల ఆదరణ ఎంతో అవసరమని జిల్లా నాటక సమాజాల సమైక్య అధ్యక్షులు పెబ్బేటి నిరంజన్ అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం కందనూలు కళా సేవా సమితి కార్యాలయంలో క్లాస్మెట్ క్లబ్ రంగస్థల కళాకారుల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిరంజన్ మాట్లాడుతూ పౌరాణిక నాటకాలైన రామాంజనేయ యుద్ధం ద్వారా సత్య ధర్మ పాలనను, కృష్ణార్జున యుద్ధం ద్వారా రాజనీతిని, సత్యహరిశ్చంద్రుడిని నాటకం ద్వారా సత్యం, ధర్మం యొక్క విలువలను సమాజానికి తెలుపుతాయని, మరెన్నో నాటకాలు ప్రజలకు నైతిక విలువలను సందేశాలను అందిస్తాయన్నారు. నాటక రంగం సమాజానికి ఎల్లప్పుడు అత్యంత అవశ్యకమన్నారు. క్లాస్మెట్ క్లబ్ వారి యొక్క సేవా తత్పరతను కొనియాడారు. అనంతరం కళాకారులను శాలువాలతో సన్మానించి చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో కందనూలు కళా సేవా సమితి అధ్యక్ష కార్యదర్శులు బి.నర్సింహ్మారెడ్డి, జి.మురళీధర్‌రావు, ఆర్.సత్యం, కేశవాచారి, వెంకటేశ్వర్లు, విష్ణుమూర్తి, ఆకారపు రాంమోహన్, బాబుమియా, పాండుచారి, సుదర్శనాచారి, విజయకాంత్, విష్ణుచారి, సుగుణాచారి తదితరులు ఉన్నారు.

## జాతీయ సదస్సులో బిఆర్ఆర్ విద్యార్థులు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అతిథిగా హాజరై జీవవైవిధ్య పరిరక్షణలో మార్గదర్శక హీరోలు అనే అంశంపై ప్రసంగించారు. ఇదే సదస్సులో కళాశాలలో బీజడ్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో కర్బన స్వాంగీకరణ అనే అంశంపై తన వ్యాసాన్ని విశదీకరించారు. కళాశాల ప్రాంగణంలో ఉన్నచెట్లు కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకుంటున్నాయో అనే పరిశోధనను ఇతర విద్యార్థులతో కలసి డా. సదాశివయ్య ఆధ్వర్యంలో పరిశోధన చేశాడు. తన పరిశోధనా ఫలితాలను ఈ సదస్సులో తెలియజేశాడు. ఇందుకుగాను ప్రథమ బహుమతి అందుకున్నాడు. ఈ సదస్సులో కళాశాల నుండి పరిశోధక విద్యార్థి రమాదేవి, బీజడ్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిరాం పాల్గొన్నారు. జాతీయ సదస్సులో ప్రథమ బహుమతి సాధించిన రాహుల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం అభినందించారు.

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక..

**- జిల్లాలో పోలింగ్ 99.69శాతం**

**- జిల్లాలో 319 ఓట్లకు గాను 318 ఓట్లు నమోదు**

**- జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించిన మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4 గంటలకు అర్హులైన ప్రజా ప్రతినిధి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సమయం ముగిసే సరికి 319 ఓట్లకు గాను 318 ఓట్లు పోలయ్యాయి. దీంతో జిల్లాలో 99.69 పోలింగ్ శాతం నమోదైనట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్‌లో 101 మందికి గాను 100 మంది, కల్వకుర్తిలో 72 మందికి గాను 72, కొల్లాపూర్‌లో 67 మందికి గాను 67 మంది, అచ్చంపేటలో 79 మందికి గాను 79 ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులతో మాట్లాడి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుంచి నేరుగా రిసీవింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్స్‌లను పటిష్ట భద్రత మధ్య తరలించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్‌లో కౌంటింగ్ నిర్వహిస్తార న్నారు. అదనపు కలెక్టర్, ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సీతారామారావు, నాగర్‌కర్నూల్ జెడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీ లించారు. ఎక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేలా కృషి చేసిన అధికార యంత్రాంగానికి జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ**

నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పైక భవనంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ఎన్నికలు ప్రారంభం కాగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు హక్కు ఉన్న ఎంపీటీసీలు, జిల్లా పరిషత్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు మొత్తం క్యాంప్‌ల నుంచి నేరుగా ఎన్నికల కేంద్రానికి తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎంపీ పోతుగంటి రాములుతో పాటు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద ఆర్డీఓ, తహసీల్దార్, డీఎస్పీ, సీఐలు పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

**ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్**

**కల్వకుర్తిలో...**కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక సంస్థల ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కల్వకుర్తి పోలింగ్ కేంద్రంలో 72 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.... ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు హక్కు ఉన్న ఎంపీటీసీలు, జిల్లా పరిషత్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు మొత్తం క్యాంప్‌ల నుంచి నేరుగా ఎన్నికల కేంద్రానికి తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్‌లు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద తహసీల్దార్ ఇబ్రహీం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ నాగర్జున, ఎస్ఐ మాధవరెడ్డి, ఊర్కొండ ఎస్ఐ వీరబాబులు పర్యవేక్షించారు. కల్వకుర్తిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసాయి.



ఓటు వేస్తున్న ఎంపీ రాములు



ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్



క్యాంప్ నుంచి ఎన్నికల కేంద్రానికి వచ్చిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లు

# విద్యార్థుల ఆవిష్కరణలు అద్భుతం...

**విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగులకు సైన్స్‌ఫెయిర్ కార్యక్రమాలు**

**ఎంతో దోహదపడుతాయి:పాఠశాల ప్రిన్సిపాల్**

**కల్వకుర్తిటౌన్,మార్చి 28 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని రెయిన్‌బో స్టార్స్ ప్లే స్కూల్‌లో గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సైదా అరీబా తన్వీ ర్ ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. సైన్స్‌ఫెయిర్ కార్యక్ర మంలో విద్యార్థులు తమ అద్భుత ఆలోచనలు ఉపయోగించి పలు రకాల ప్రద ర్శనలను రూపొందించి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆశ్చ ర్యపరిచారు. ఈ సంద ర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు సైదా అరీబా తన్వీర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగు లకు సైన్స్ ఫెయిర్ కార్యక్రమా లు ఎంతో దోహదపడుతాయని ఆమె పేర్కొన్నా రు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని వారి మేధాశక్తితో నూతన ప్రాజెక్టులు తయారు చేయాలని అకాంక్షించారు. సైన్స్ ఫెయిర్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో ఆలోచన శక్తితో పాటు విజ్ఞానం కూడా పెరుగుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో సృజనాత్మక శక్తిని పెంచి సమాజానికి ఉపయోగపడే విధంగా వైజ్ఞానిక ప్రయోగాలు చేపట్టాలని ఆమె అకాంక్షించారు. సైన్స్ ఫెయిర్‌లో ఎల్‌కేజీ టూ 5వ తరగతి విద్యార్థుల 50మంది వరకు పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులందరికి ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో మెడల్స్ బహుకరించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు సైదా అరీబా తన్వీర్



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయురాలు

## భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరిన బి.ఆర్.ఎస్ నాయకులు..

**కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించిన డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి**

**పెబ్బేరు,మార్చి 28,ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని వివిధ గ్రామాలలో బి.ఆర్.ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి చేరికల పర్వం కొనసాగుతుంది.పెబ్బేరు మండలం బున్యదిపురం గ్రామానికి చెందిన విజయ్ గౌడ్ తో పాటు దాదాపు 30 మంది బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి,గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు ఈ సందర్బంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు,కృపాకర్ రెడ్డి,రణధీర్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి,పాతపల్లి శేఖర్,సుగురు శివ,అచ్చన్న నాయుడు,ఎస్ కురుమన్న,మురళి తదితరులు పాల్గొన్నారు.



చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన బి.ఆర్.ఎస్ నాయకులు

## చెత్త తొలగించండి మహాప్రభో కాలనీవాసుల మొర..

**ఆత్మకూర్,మార్చి 28,ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని పలు వీధులలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించేందుకు ప్రజానిధులు గాని అధికారులు కానీ చీరలు చేపట్టాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రధానంగా పట్టణంలోని రెండవ వార్డులో మటన్ మార్కెట్ సంత బజార్ జరుగుతున్న నేపథ్యంలో ప్రతినిత్యం చెత్త పెరుగు పేరుకుపోయి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత వారం రోజులుగా చెత్తను తొలగించాలంటూ మున్సిపల్ కమిషనర్‌కు కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.అసలే వేసవికాలం కావడంతో పేరుకుపోయిన చెత్త పై అజ్ఞాతవాసులు ఎవరైనా నిప్పురవ్వలు వెలిగించిన పక్షంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండంటూ ఆయా కాలనీలకు చెందిన పలువురు ప్రజలు వాపోతున్నారు.పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం బీడు భూములలో సైతం ప్రతినిత్యం చెత్తను పారవేస్తున్నారు.కానీ చిత్ర తొలగించే కార్యక్రమాలు చేపట్టకపోవడం పట్ల పలువురు ప్రజలు విమర్శల వర్షం కుప్పిస్తున్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి పట్టణంలోని ఆయా వార్డుల లో చెత్తను తక్షణమే తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని రెండవ వార్డులో పేరుకుపోయిన చెత్త

## జోగులాంబ సన్నిధిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు..

**అలంపూర్ మార్చి 28 ప్రభాతవార్త :** దక్షిణాకాశీగా విరాజల్లుతున్న ప్రముఖ శైవ క్షేత్రం ఐదవ శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ అమ్మవారు, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఎమ్మెల్సీ జిల్లా వెంకట్రామి రెడ్డి ఎమ్మెల్యే విజేయుడు,బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.ఆలయ మర్యాదలతో అర్చకులు వారికి స్వాగతం పలికారు.అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.తదనంతరం వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలతో సన్మానించారు.తీర్థప్రసాదాలు అందజేశారు.వారి వెంట ఇటిక్యాల జడ్పిటిసి హనుమంత్ రెడ్డి,ఎంపిటిసిలు, నాయకులు అగస్త్య రెడ్డి, రఘురెడ్డి,నాగేశ్వర్ రెడ్డి,వావిలాల రంగారెడ్డి,తదితరులు ఉన్నారు.



ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు

## ఓటు హక్కును వినియోగించుకున్న వడ్డేపల్లి ప్రజాప్రతినిధులు



**అలంపూర్ మార్చి 28 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో భాగంగా గురువారం గద్వాలజిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.వడ్డేపల్లి వైస్ఎంపిపి కొంకల చంద్రశేఖర్ గౌడ్,కౌన్సిలర్ అజయ్,అమరవాయి ఎంపిటిసి రోశన్న తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు వారు తెలిపారు.

## రూ.5759 ధర పలికిన ఆముదాలు..

**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు గురువారం రైతులు 51 కింటాళ్ళ ఆముదాలను విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ. 5759 ధర పలికింది.అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది. అలాగే 86 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్ సోన ధాన్యానికి రూ.2369 ధర పలికింది.అలాగే అతి తక్కువగా 2059 ధర పలికింది.12 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ.1504 ధర పలికింది.అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది.45 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్ కందులకు రూ. 9700 ధర పలికింది.అతితక్కువగా రూ.9650 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## జిల్లా కోర్టు బార్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది వి.రాధకృష్ణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 28 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు నూతన అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది వి.రాధకృష్ణ ఎన్నికయ్యారు. 2024-25 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల అనుసారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో ఎస్.అర్జునయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించి నిర్వహించిన బార్ ప్రెసిడెంట్ ఎన్నికల్లో న్యాయవాది వి.రాధకృష్ణ, బార్ సెక్రటరీగా ఏ.పర్వత్‌రెడ్డిలు గెలుపొందారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా వి.రఘునాథ్‌రావు, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ ఫసియోద్దిన్, ట్రెజరరీగా వి.బంగారయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కంచే శేఖర్, ఖాజా అబ్దుల్, రహీమ్, జి.భవాని భాయ్, పి.రజనీకుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నిక బార్ అసోసియేషన్ కమిటీకి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.



## టీ పాయింట్‌ను ప్రారంభించిన బీజేపి ఇంచార్జి ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర,మార్చి 28 ప్రభాతవార్త:** జాతీయరహదారిపై కొత్తగా ఏర్పాటు చేసిన కాఫీ ఎక్స్‌ప్రెస్ టీ పాయింట్‌ను గురువారం బీజేపి దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ప్రార ంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గూటిపల్లి నరేందర్‌రెడ్డి,నవీన్ రెడ్డి,రాఘవేందర్, నరసింహ్మలతో పాటు కేపీఆర్ యువసేన అధ్యక్షుడు రాజు.వీరేశ్,అంజి తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు

- పర్యావరణ కాలుష్యాన్ని రూపుమాపాలి
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ సోషల్ సైంటిస్టు డా. డబ్ల్యుజి ప్రసన్నకుమార్
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి28 ప్రభాతవార్త:** నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అత్యంత జటిలమైన సమస్య అయినా పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండల సీనియర్ సోషల్ సైంటిస్టు డా.డబ్ల్యుజి ప్రసన్నకుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, పాలమూరు యూనివర్సిటీ విద్యా కళాశాల సంయుక్తంగా నిర్వహించిన నీటి అడుగుజాడలను తగ్గించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లను నివారించడంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయ విద్య ఒక అసాధారణ అవకాశమని, కావలసిన అభ్యసనా ఫలితాల ప్రకారం పాఠ్య ప్రణాళికలను రూపొందించడం చాలా అవసరం అన్నారు. క్లీన్ క్యాంపస్‌లు ఆరోగ్యకరమైన క్యాంపస్‌లు అని, నీటి వనరులలో నీరు ఉండాలని, మనం నీటిని తెలివిగా వినియోగించుకోవాలని స్వల్పకాలిక, దీర్ఘకాలికంగా పర్యావరణంపై ప్రభావం చూసే వ్యవస్థలను రూపొందించడంలో విశ్వవిద్యాలయాలకు ఎక్కువ బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం కారణంగా అన్ని జీవులు బాధపడుతున్నాయి. కావున పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి కోసం అదే విధంగా మానవ జీవన ప్రమాణాలను పెంపొందించడానికి విద్యా స్థాయిలో పర్యావరణ విద్యను తప్పనిసరి చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్ జె.పద్మ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం విద్యార్థులు తరువాత ఉపాధ్యాయులుగా అనుభవ పూర్వక అభ్యసనా పద్ధతులు అభ్యసిస్తారని, భవిష్యత్తులో మంచి ఉపాధ్యాయులుగా రాణిస్తారని చెప్పారు. పర్యావరణ క్షీణతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డా బషీర్ అహ్మద్ ఈ వర్క్‌షాప్ ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యా సంస్థలలో నీటి అడుగు జాడలను తగ్గించడం, సింగిల్ యూస్ ప్లాస్టిక్లను తొలగించడం వంటి విలువలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపు పర్యావరణ సవాళ్లను పరిష్కరించడానికి, నైపుణ్యాలను కలిగిన పర్యావరణ స్పృహ కలిగిన రాబోయే తరాన్ని పెంపొందించడానికి ఒక ముఖ్యమైన దశను సూచిస్తుందన్నారు. వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డా. ఆదేర్ల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి పాదముద్రను తగ్గించడానికి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలించడానికి విద్యార్థులు వినూత్నమైన పాఠ్యప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పర్యావరణ సమతుల్యం కాపాడే అవసరమైన లైఫ్ స్కిల్స్‌తో విద్యార్థులను సిద్ధం చేయాలని విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడానికి విద్యావేత్తలు తమవంతు కృషి చేయాలని, పర్యావరణ విద్యను మరింత సందర్భోచితంగా చేయడానికి నూతన జాతీయ విద్యా విధానంలో పొందురిచిన స్వదేశీ పరిజ్ఞానం ద్వారా పర్యావరణ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. పర్యావరణ విద్య పాఠ్యాంశాలను రూపొందించడం చాలా అవసరమని ఈ సందర్భంగా అన్నారు. ఈ వర్క్‌షాపులో కళాశాల హెడ్ డా.జంగం విశ్వనాథం, డా.ఆంజనేయులు, వినోద్‌కుమార్, డా.కె. విజయలక్ష్మి, జయనాయక్, వివిధ కళాశాలల నుండి ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు 150 మంది పాల్గొన్నారు.

## మళ్లీ మోడియే మా ప్రధాని

- బీజేపీలో చేరిన కోయిలకొండ యువకులు
- కండువా కప్పి ఆహ్వానించిన బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28, ప్రభాతవార్త:** మళ్లీ మోడియే తమ ప్రధాని అని, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో డీకే అరుణ, దేశంలో మోడీ అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కోయిలకొండ మండలానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో పార్టీలో చేరారు. ఈమేరకు డీకే అరుణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా మోడీనినాదాలే వినిపిస్తున్నాయన్నారు. మోడీని మళ్లీ ప్రధాని చేయాలని ప్రజలుఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలనికోరారు. డీకే అరుణ గెలపుకుతామంతా శ్రమిస్తామని, బీజేపీ విజయం తథ్యమన్నారు. యువకులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ డీకే అరుణను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



పదవి విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

**మాగనూరు, మార్చి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ శివరాజ్ పదవి విరమణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. శివరాజ్ సార్ పాఠశాలలో ఉన్నంత కాలం ఆయన బాధ్యతలను సక్రమంగా చేపట్టి విద్యార్థులకు వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో కృషి చేయడం జరిగిందని చీకటి నుండి విద్యార్థుల జీవితాలలో వెలుతురు నింపారని కాంగ్రెస్‌నాయకులు ఆనంద్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కొత్తకోట సిద్ధార్థరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, జి.నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ వడ్వాట్ రవిందర్, కున్సి నాగేందర్, రాకేష్ (మురహర్‌దొడ్డి), బివిఎన్ నరేష్, మండల యూత్ కాంగ్రెస్ డి.ఆనంద్, బి.మహేష్, టి.రాము పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ట్రస్టు ఛైర్మన్ సోమనాద్రి



**ఇటిక్యాల, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరు గ్రామానికి చెందిన పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్టు ఛైర్మన్ పోతురాజు సోమ నాద్రి గురువారం జరిగిన మండలంలోని కొండేరు, షాబాద్, బుడ్డారెడ్డిపల్లి, వడ్డేపల్లి గ్రామాలలోని వివాహాలకు ఆయన హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరివెంట నాయకులు బీచుపల్లి, జాకీర్, హనుమంతు, శ్రీను, పెద్ద సవారన్న, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి

**అడ్డాకుల, మార్చి28 ప్రభాతవార్త:** అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి ఎ.దయాకర్, సోదరుడు, ఎ.ప్రభాకర్, మేఘన శుభకార్యంలో గురువారం మాజీమంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దమందడి మండల పార్టీ అధ్యక్షులు ఎం.వేణుమాధవ్, ఎంపిటిసివి.గణేష్, మాజీఎంపిపి ఎ.దయా కర్, నాయకులుఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా మోహన్‌కుమార్ యాదవ్ విజయం



నూతనంగా ఏర్పడిన న్యాయవాదుల సంఘం కార్యవర్గం

**వనపర్తి ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** వనపర్తి న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సి.మోహన్ కుమార్ యాదవ్, గెలుపొందారని ఎన్నికల అధికారులు ఉత్తరయ్య, రఘు ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బాలనాగయ్య మహిళా ప్రతినిధిగా శ్రీదేవి ఎన్నికలలో విజయం సాధించారని వారు తెలిపారు. పోటీలో ఎవరు లేకపోవడంతో ఉపాధ్యక్షులుగా దేగల కృష్ణయ్య, జె.బ్రహ్మయ్య చారి సహాయ కార్యదర్శిగా పి.శంకర్ కోశాధికారిగా ఎం.ఆంజనేయులు క్రీడల అధికారిగా ఎన్.రందూలి గ్రంథాలయ కార్యదర్శిగా ఎం.కృష్ణయ్య , కార్యవర్గ సభ్యులుగా రాజి రియాజ్ అహ్మద్, ఎన్.త్రినాథ్, ఎన్.తిరుపతయ్య వేదన్యాస్ ఎన్నికయ్యారని వారుపేర్కొన్నారు. నూతన న్యాయవాదుల సంఘం కార్యవర్గం ఏప్రిల్ ఒకటవ ప్రమాణ స్వీకారం ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు.

## చికిత్స పొందుతున్న బాధితులకు పరామర్శ



చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి మార్చి28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీరంగాపూర్ మండల్ నాగసాని పల్లె గ్రామానికి చెందిన వ్యక్తులు ఆంజనేయులు, చెన్నమ్మ , సాయమ్మ, సాయి తేజ, చిన్నబిసన్న, చెన్నమ్మ, చిట్టెమ్మ, శంకరమ్మ, నాగసానిపల్లెపానుగల్ మండలం బుసిరెడ్డి పల్లె గ్రామంలో పెళ్లికి వెళ్లే మార్గంలో తుఫాన్ అదుపు తప్పి గాయపడ్డారు వారిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వనపర్తి ప్రభుత్వ హస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. గాయపడిన ఆంజనేయులు, సాయి తేజను మెరుగైన వైద్యం కోసం నిమ్స్ హస్పిటల్‌కి తరలించడం జరిగింది. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆదేశించారు. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని అన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**రేవల్లి, మార్చి 28, ప్రభాతవార్త:** రేవల్లి మండలం చెన్నారం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098వనపర్తి జిల్లా ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ మాట్లాడుతూ....బాలం హక్కులు మరియు రక్షణ చట్టాలు బాలవివాహ్ నిషేధ చట్టం 2006, బాలలపై లైంగిక వేధింపుల నిరోధ చట్టం 2012, బాల కార్మిక నిషేధ చట్టం 2016, తల్లిదండ్రులు లేని ఆర్ఫన్ పిల్లలకు చదువు కోవడం కోసం స్పాన్సర్షిప్ పథకం ఏర్పాటు చేయడం జరిగిందనీ ఈ పథకం అందించే విధానం, లవ్‌ఎలప్మెంట్ కేసులు, యువతపై మాదకద్రవ్యాల యొక్క ప్రభావం, సైబర్ నేరాలు, వేసవికాలంలో బాలల సంరక్షణకు సంబంధించిన అంశాలపై అలాగే జిల్లా బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సేవలు అత్యవసర చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లు 1098 112 100 నెంబర్లకు బాలలకు ఎలాంటి సమస్యలు ఉన్న ఫోన్ కాల్ చేసి సమాచారం అందించలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాజు చైల్డ్ హెల్ప్ లైన్ కేస్ వర్కర్ గ్రామ మహిళా సంఘ సభ్యులు ఉపాధి హామీ కూలీలు తదితరులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## పూర్తికాని బిటిరోడ్డు.. తప్పని ఇక్కట్లు

- ఎన్నికల ముందు హడావుడి.. నేడు నిర్లక్ష్యం
- ప్రమాదాలకు నెలవుగా జటప్రోలు బిటి రోడ్డు



ఎన్నికల ముందు తవ్వి వదిలేసిన రోడ్డు

**కొల్లాపూర్, మార్చి28 ప్రభాతవార్త:** ప్రారంభం ఘనం.. పనులేమో శూన్యం. సరిగ్గా ఐదు నెలల క్రితం ఎన్నికల ముందు పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో కొల్లాపూర్ పెబ్బేరు వెళ్లే ప్రధాన రహదారిపై తాత్కాలిక మరమ్మతులుగా భావించి సుమారు ప్రధాన రహదారిని కిలోమీటరు మేర పూర్తిగా వదిలేశారు. నాటినుంచి నేటివరకు రెండు వరుసల బిటి రోడ్డు నిర్మాణానికి నోచుకోక, ఒకవైపు కంకర తేలి తవ్విన రోడ్డు మరోవైపు గుంతలు పడి ఉన్న సింగిల్ రోడ్డు, మరమ్మతుల పేరుతో నాటి మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మంజూరు చేయించారు. హడావుడిగా ఎన్నికల ముందు పనులు ప్రారంభించి ఇక అక్కడితో వదిలేయడం జరిగింది.



ప్రమాద భరితంగా జటప్రోలు గ్రామ రోడ్డు

ఎన్నికల తర్వాత ఫలితాలు తారుమారు కావడంతో రాష్ట్రంలో, స్థానిక నియోజకవర్గంలో అధికార ప్రభుత్వం మారడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోవడం జరిగింది. దీంతో రాజకీయ గ్రహణమో, లేక నిండా అధికారుల పాలకుల నిర్లక్ష్యమో కానీ సామాన్య ప్రజలకు మాత్రం ప్రతిరోజు దినదిన గండంగా గడుస్తుంది. జటప్రోలు గ్రామంలో గ్రామం ఇరువైపులా ఉన్న డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ప్రయాణీకులకు ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, వీలైనంత త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ప్రయాణీకుల ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రమంత్రి జూపల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న కొల్లాపూర్ నియోజకవర్గానికి ప్రధాన రహదారి కావడంతో మంత్రి జూపల్లి చొరవ తీసుకొని కొల్లాపూర్ నుంచి పెబ్బేరు వరకు గల రోడ్డు మరమ్మతులు, ప్యాచ్‌వర్క్ పూర్తిచేసి సిగ్నల్, సూచికల బోర్డులు సైతం ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు భావిస్తున్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ ఆసుపత్రి ఎదుట ధర్నా



ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నానిర్వహిస్తున్న కార్మికులు

**ఆత్మకూర్, మార్చి28, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసు పత్రిలో పనిచేస్తున్నటువంటి శానిటేషన్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలంటూ గురువారం సాయంత్రం మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఐ ఎన్‌టియుసిఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి బోరింగ్ శ్రీనివాసులు పి సురేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నటువంటి శానిటేషన్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్ర మెడికల్ డైరెక్టర్ కు పెండింగ్ వేతనాలు చెల్లించాలంటు పలుమార్లు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ప్రభుత్వంలో చలనం రాకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. మార్చి 31 వ తేదీల్లోగా పెండింగ్ వేతనాలు చెల్లించిన పక్షంలో ఏప్రిల్‌ఒకటవ తేదీనుండి వైద్య విధానపరిషత్ కార్యాలయాల ముందు రాష్ట్రవాప్తంగా నిరవధిక సమ్మెకు పూనుకుంటామని వారు హెచ్చరించారు. అనంతరం ఆత్మకూర్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ హరి నారాయణకువినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రఘు చిన్నమ్మ తదితరులతో పాటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

## ఈదుల చెరువును సందర్శించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు



రైతులతో ఈదుల చెరువు సందర్శిస్తున్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** మెట్టుపల్లిలో ఉండే ఈదుల చెరువును రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సందర్శించడం జరిగింది అక్కడ రైతులు చెప్పినటువంటి సమస్య ఏమిటంటే ఈదుల చెరువు నుండి మోటర్ల ద్వారా నీరు ఎత్తిపోసి రంగం గడ్డ ,నందిమల్లగడ్డ, వేపుల, మెట్టుపల్లి తాండ దాదాపు 2వేల ఎకరాలు విస్తీరంలో ఉన్నటువంటి పొలాలను నీరు వేసవి కాలం వచ్చిన వెంబడే ఆ యొక్క మోటర్లకు నీళ్లు అందక ఈ యొక్క పంట పొలాలు ఎండి పోతున్నవని అని దృష్టికి తీసుకువెళ్లినారు కాబట్టి చిన్నారెడ్డి ఆ యొక్క మోటర్లు ఉండే ప్రాంతానికి వెళ్లి ఆ యొక్క మోటర్లు ఎక్కడైతే లోతు ఎక్కువగా ఉండే పుష్కలంగా నీళ్లు మోటర్లకు అదేవిధంగా ఆ యొక్క లోతు ఎక్కువగా ఉండే ప్రాంతానికి మార్చడానికి పైపులు గాని విద్యుత్తు గాని అన్నిటిని కూడా అతి తొందరలోనే శాంక్షన్ చేపించి లోతు ఆ మొటర్లను లోతుప్రాంతంలో పెట్టిచ్చి రైతులకు ఎలాంటిఇబ్బంది లేకుండా చూస్తానని మెట్టుపల్లి రైతులకు హామీ ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఫిషర్మెన్ కమిటీఅధ్యక్షుడు నందిమల్లయాదయ్య మొగలిసత్యరెడ్డి, రాగి వేణు, మొజర్ల, మన్యం బాలరాజ్ కురుమూర్తి నాగన్న రాజు పాల్గొన్నారు.

## మదీనా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



ముస్లిం పెద్దలతో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ప్రతినిది, మార్చి28, ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని బసవన్న గడ్డలో గల మదిన మసీదులో కాంగ్రెస్ మైనరిటీ నాయకుడు పజిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘా రెడ్డి పాల్గొని ముస్లిం సహూదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పవిత్ర మాసంగా జరుపుకునే రంజాన్ మాసాన్ని ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్దలతో జరుపుకుంటారని హిందూ, ముస్లింలు కలిసిపోయి రంజాన్ మసాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటారని ఆయన అన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాధాకృష్ణ, కౌన్సిలర్లు చీర్ల సత్యం సాగర్, వెంకటేష్, లక్ష్మీ, రవి యాదవ్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షుడు చెందర్ నాయకులు లక్కాకుల సతీష్ సత్యశీలారెడ్డి ముస్లిం సోదరులు తాహెర్, నిరంజన్ , రహీం, చాంద్పాషా, యాకూబ్, షఫీ అఖ్తర్ తదితరులు పాల్గొన్నారు.

## మన్నెం జీవన్‌రెడ్డి గెలుపు ఖాయం



ప్రజాప్రతినిధులతో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నెం జీవన్ రెడ్డి గెలుపు ఖయమని ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో 6 గ్యారెంటీ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి. ఎంపిటిసి, కౌన్సిలర్లు ఆయన వెంట ఉన్నారు.

## బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి అభ్యర్థి నవీన్‌రెడ్డికి మద్దతుగా నిలిచిన ప్రజాప్రతినిధులకు ధన్యావాదాలు



ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డితో బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

**వనపర్తి ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** నవీన్ రెడ్డికి మద్దతు ఇచ్చి ఓటు వేసిన ఉమ్మడి జిల్లా జడ్పిటిసి ఎంపిటిసిలకు, కౌన్సిలర్లకు మాజీ మంత్రివర్యులు నిరంజన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అధికార పార్టీ ప్రలోబాలకు లోంగకుండా పార్టీకి మద్దతు ఇచ్చి ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలిచారు. అని ధర్మం విజయం సాధిస్తుందని అన్నారు జిల్లా వ్యాప్తంగా నవీన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్యేలకు, రాష్ట్ర, జిల్లా నాయకులు, పార్టీ కార్యకర్తలకు హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. మొక్కవోని ధైర్యంతో ఎం.ఎల్.సి అభ్యర్థి నవీన్ రెడ్డి గెలుపు కోసం కృషి చేసిన విధంగానే పార్లమెంట్ ఎన్నికలలో కూడా పని చేసి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు.

## మృతురాలి కుటుంబసభ్యులకు పరామర్శ



రఘువీరారెడ్డిని పరామర్శిస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

**పెబ్బేరు మార్చి 28 ప్రభాతవార్త:** పెబ్బేరు మున్సిపాల్టికి చెందిన మాజీ వార్డు సభ్యులు కాటమోని ఎల్లమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లేల చిన్నారెడ్డి ఎల్లమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసినివాళులర్పించారు. మృతురాలికుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రఘు వీరారెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు కారుపాకుల వెంకట్‌రాములు యాదవ్, ఎద్దుల విజయ వర్ధన్‌రెడ్డి, సహాదేవుడు, చంద్రశేఖర్ నాయుడు, రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఘన సన్మానం



బార్ అసోసియేట్ అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్, మార్చి 28 ప్రభాతవార్త :** నారాయణపేట బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలలో నూతన కార్యవర్గాన్ని అంబేద్కర్ యువజన సంఘం ఘనంగా సత్కరించడం జరిగింది. ఈసందర్భంగా జరిగిన ఎన్నికలలో నారాయణపేట జిల్లా సీనియర్, జూనియర్, సివిల్ కోర్టు, జిల్లా కోర్టు అడ్వకేట్స్ ఈ ఎన్నిలలోఓటు హక్కును వినియోగించుకోవడం జరిగింది. అధ్యక్షునిగా సీనియర్ అడ్వకేట్ దామోదర్‌గౌడ్, మల్లికార్జున్ అడ్వకేట్, రఘువీర్ యాదవ్ పోటీలో నిలవడం జరిగింది. జనరల్ సెక్రెటరీగా సీనియర్ అడ్వకేట్ చెన్నారెడ్డి, కోశాధికారిగా సీనియర్ అడ్వకేట్ ఆడెం శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడి పదవికి జరిగిన ఎన్నికల్లో సీనియర్ ఆడ్వకేట్ దామోదర్‌గౌడ్, విజయం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ నారాయణపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని అంబేద్కర్ యువజన సంఘం, మక్తల్ అధ్యక్షులు కె. కురుమయ్య, మాజీ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు జె. నర్సిములు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి దళిత ప్రజానీకం వివిధ రకాల కేసులకు పక్షపాతంగా వ్యవహరించకుండా దళితులకు అండగా నిలవాలని ఈ నూతన కార్యవర్గాన్ని కోరడం జరిగింది. కార్యక్రమంలో అడ్వకేట్స్ హన్మేష్, నవీన్, రాజశేఖర్, కె.నరసింహులు, కురుమయ్యగౌడ్, కృష్ణగౌడ్, రవికుమార్, కాళేశ్వర్, శ్రీకాంత్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది

**పాలమూరు పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి రుద్రసముద్రం రామలింగం**



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**మక్తల్, మార్చి 28 ప్రభాతవార్త :** పాలమూరు పార్లమెంటులో ఉన్న యువత దేశ భవిష్యత్తుకు పునాది లాంటి వారని అన్నారు. మూడు నియోజకవర్గ పరిధిలో నారాయణపేట నియోజకవర్గ పరిధిలో దేవరకద్ర నియోజకవర్గ పరిధిలో బండర్‌పల్లి మన్నెంకొండ అడ్డాకుల మహబూబ్‌నగర్ పరిధిలో జడ్చర్ల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఆయన మాట్లాడుతూ రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను ఆశీర్వదించడం అని యువతను మేల్కొల్పే విధంగా ప్రచారం ప్రారంభించారు. ఈ దేశంలో నిరుద్యోగం పోవాలంటే దేశంలో ఉన్న యువత అందరికి ఉపాధి కల్పించాలని వారన్నారు. మూడు నియోజకవర్గాల్లో ఉన్న యువత మొత్తం కూడా రేపు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి అయిన నాకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రధానంగా యువత రాజకీయా ల్లోకి రావాలని రామలింగం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నవీన్ వెంకటేష్, వీరేష్, రామనాయక్, వెంకటరెడ్డి, సలీం, వీరేష్, రాజారామ్, మహేందర్ యాదవ్, వివేక్ నాయక్ ఉన్నారు.

## మాదే విజయం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు స్వేచ్ఛను కోరుకుంటున్నారని అందుకే మేము ప్రజాస్వామ్య పద్ధతిలో మా అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటువేయాలని అభ్యర్థించామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 మంది ఎమ్మెల్యేలం ఎవరము క్యాంపు రాజకీయాలు చేయలేదని, ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రయత్నంలో ఉన్నామన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఎంత ప్రయత్నించినా ఫలితం మా వైపే ఉందని 80 శాతం ఎంపిటిసిలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. వ్యాపారులను, రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం ధ్వంసం చేసి నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, పోలీస్ వ్యవస్థను సైతం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేశారని ఆయన మండిపడ్డారు.

## యువతి అదృశ్యం

**రాజాపూర్, మార్చి 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని దొండ్లపల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. కుటుంబ సభ్యులు ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దొండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి గురువారం ఉదయం 5 గం.లకు నిద్రలేచిన తల్లి లక్ష్మమ్మకు తన కూతురు కనిపించకపోవడంతో అదే గ్రామానికి చెందిన చాకలి మల్లేష్ తండ్రి రమేష్‌పై అనుమానం ఉన్నట్లు తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరఖాస్తు చేస్తున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు.

## అక్రమ మద్యం పట్టివేత

**రాజాపూర్, మార్చి 28 ప్రభాతవార్త :** అక్రమంగా మద్యాన్ని నిల్వచేసి అధిక ధరలకు అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై కె.రవి తెలిపారు. మండల పరిధిలోని దొండ్లపల్లి గ్రామంలోని ఓ వ్యక్తి తమ ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు పోలీస్ సిబ్బంది గురువారం మధ్యాహ్నం దాదాపు 12.30 గం.ల సమయంలో ఓ వ్యక్తి తన ఇంటిలో అక్రమంగా మద్యం నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారంతో తనిఖీ చేసి అక్రమంగా నిర్వహించిన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై కె. రవి తెలిపారు. కానిస్టేబుల్ శంకర్ ఫిర్యాదు మేరకు దొండ్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఎలాంటి పర్మిట్ అనుమతి లేకుండా అక్రమంగా దాదాపు 17 లీటర్ల మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి అధిక రేట్లకు అమ్ముతున్నాడని అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె. రవి తెలిపారు.

## ఇసుక అక్రమ ట్రాక్టర్ పట్టివేత

**తెల్కపల్లి, మార్చి 28 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై బి. నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గట్టునెల్లికుదురు గ్రామానికి చెందిన పులిరాజరత్ శివకుమార్ గురువారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తన ట్రాక్టర్ నంబర్ టిఎస్ 31 టిఎ 1858, ట్రాలీ నంబర్ టిఎస్ 31 టిఎ 1858లో ఇసుకను తరలిస్తుండగా మండల పరిధిలోని గౌరెడ్డిపల్లి గ్రామం వద్ద పట్టుకుని ట్రాక్టర్ నిర్వాహకుడు శివకుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లయితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఆత్మకూర్, మార్చి28, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నటువంటి శానిటేషన్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలంటూ గురువారం సాయంత్రం మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఐఎన్‌టియు సిఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి బోరింగ్ శ్రీనివాసులు పి సురేష్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నటువంటి శానిటేషన్ కార్మికులకు వేత నాలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని వారు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మార్చి 31 వ తేదీల్లోగా పెండింగ్ వేతనాలు చెల్లించిన పక్షం లో ఏప్రిల్‌ఒకటవ తేదీ నుండి వైద్య విధాన పరిషత్ కార్యాలయాలముందు రాష్ట్రవాప్తంగానిరవధిక సమ్మెకు పూనుకుం టామని వారు హెచ్చరించారు. అనంతరం ఆత్మకూర్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ హరి నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్ర మంలో రఘు చిన్నమ్మ తదితరులతో పాటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన యువకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి28, ప్రభాతవార్త:** మళ్లీ మోడియే తమ ప్రధాని అని, మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో డీకే అరుణ, దేశం లో మోడీ అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కోయిలకొండ మండలానికి చెందిన యువకులు స్వచ్ఛందంగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ సమక్షంలో మహబూబ్‌నగర్‌లోని ఆమె నివాసంలో పార్టీలో చేరారు. ఈమేరకుడీకే అరుణకండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడికెళ్లినా మోడీనినాదాలే వినిపిస్తున్నాయన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించాలనికోరారు. డీకే అరుణ గెలపుకుతామంతా శ్రమిస్తామని, బీజేపీ విజయం తథ్యమన్నారు. యువ కులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ డీకే అరుణను సన్మానించారు. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు పిశ్రీనివాస్‌రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

**వనపర్తి ప్రతినిధి మార్చి28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో శ్రీరంగాపూర్ మండల్ నాగసాని పల్లె గ్రామానికి చెందిన వ్యక్తులు ఆంజనేయులు, చెన్నమ్మ, సాయమ్మ, సాయి తేజ, చిన్నబిసన్న, చెన్నమ్మ, చిట్టెమ్మ, శంకరమ్మ, నాగసానిపల్లెపానుగల్ మండలం బుసిరెడ్డి పల్లె గ్రామంలో పెళ్లికి వెళ్లే మార్గంలో తుఫాన్ అదుపు తప్పి గాయపడ్డారు వారిని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వనపర్తి ప్రభుత్వ హస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. గాయపడిన ఆంజనేయులు, సాయి తేజను మెరుగైన వైద్యం కోసం నిమ్స్ హస్పిటల్‌కి తరలించడం జరిగింది. గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆదేశించారు. గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని అన్నారు. వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన శాసనమండలి ఎన్నికలు

- ఓటుహక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యేలు





ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తున్న ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి

**నారాయణపేట ప్రతినిధి, మార్చి28 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు సంబంధించిన పోలింగ్ గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నంబర్ 3లో గురువారం ఉదయం 8 గం.లకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. జిల్లాలోని నారాయణపేట నియోజకవర్గం (కోయిల్‌కొండ మినహా) మక్తల్ నియోజకవర్గంలో (అమరచింత, ఆత్మకూర్ మినహా) కోస్గి, మద్దూరు మండలాలకు చెందిన జడ్పీటిసిలు, ఎంపిటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్ల, ఎక్స్ అఫిషియో సభ్యులైన నారా యణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. గురువారం సాయంత్రం ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు 99.51 శాతంగా పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం205 మంది ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ ఓటర్లు ఉండగా వారితో 89 మంది పురుషులు, 116 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసే సమ యంలోపు మొత్తం 204 మంది ప్రజాప్రతినిధులు ఓటు వేశారు. మక్తల్ మండలం మంతన్‌గోడ్ ఎంపిటిసి సభ్యురాలు సుమిత్ర తన ఓటుహక్కును వినియోగించుకోలేదు. అయితే ఓటుహక్కు వినియోగించుకున్న 204 మంది ఓటర్లలో 115మంది మహిళలు, 89 మంది పురుషులు ఉన్నారు. జిల్లాలోని 11 మంది జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, 137 మంది మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు 54 మంది మున్సిపల్ కౌన్సిలర్లతో పాటు పట్టణ స్థానిక సంస్థల ఎక్స్ అఫిషియో సభ్యులైన నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరిలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. స్థానిక పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్ మయాంక్ మిత్తల్ పరిశీలించారు. కాగా పోలింగ్ కేంద్రం వద్ద గతరెండు రోజులుగా నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా పరిధిలోని సిఐలు, ఎస్సైలు, పోలీస్ కానిస్టేబుళ్లు, సిఆర్‌పిఎఫ్ బలగాలు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సును ఎస్కార్ట్ బందోబసుత మధ్య మహబూబ్‌నగర్‌కు తరలించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

# బాధితులకు సత్వర న్యాయం జరగాలి

- గద్వాల జిల్లా ఎస్పీ రితిరాజ్
- శాంతి నగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

**అలంపూర్ మార్చి 28 ప్రభాతవార్త:** ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ రితిరాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం శాంతినగర్ పోలీస్ స్టేషన్ ఆమె సందర్శించారు. అనంతరం గతంలో నమోదు కేసులను పరిశీలించారు. గత సంవత్సరం నాన్ గ్రేవ్ కేసులలో యుఐలో ఉన్న కేసుల వివరాలను పరిశీలించి వారికి సంబంధించిన సాక్ష్యాధారాలను సేకరించి పకడ్బందిగా విచారణ పూర్తి చేసి ఫైనలైజ్ చేయాలని అన్నారు. కోర్టు లలో చార్జిషీట్ వేసిన కేసులలో వెంటనే సీసీ నెంబర్లు పొందాలని అన్నారు. కేసులను చేదించడంలో మంచి ఎఫర్ట్స్ పెట్టాలని ఎస్సై నీ ఆదేశించారు. ప్రాపర్టీ కేసులలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, పని చేయని సీసీ కెమెరాలను వెంటనే పునరుద్ధరించాలని, కమ్యూనిటీ పోలింగ్ లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు. మున్సిపాలిటీలో కాలనీల స్థానికులతో మాట్లాడి ఎంట్రన్స్ దగ్గర సీసీ కెమెరాలను చేయించాలని అన్నారు. ఆయా కేసులలో ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్ పెండింగ్ లేకుండా చూడాలని, వెంటనే రిపోర్ట్స్ తెప్పించుకొని కోర్టులో చార్జి షీట్ వేయాలని అన్నారు. గతంలో నమోదు అయిన కేసులు ఏఏ స్థాయిలో ఉన్నాయే అని తెలుసుకొని, విచారణ పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు. వారు ఏఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. ప్రతి రోజు సిబ్బందికి స్టేషన్ లో రోల్ కాల్ నిర్వహించి వారి వారికి కేటాయించిన వీదుల పై బ్రీఫ్ చేయాలని ఎస్సైకి సూచించారు. పోలీస్ స్టేషన్ నుండి ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలను జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24(7) గస్తీ నిర్వహించాలని, సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం సిబ్బందిఅందరి దగ్గరఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలనీ, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను, డయల్-100, సైబర్ నేరాల పట్ల ప్రజలతో పాటు యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లోలో ఎంట్రీ చేసి తీసుకున్నా చర్యలను బాధితులకు తెలియజేయాలని ఆదేశించారు. ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని సూచించారు.

**ఫిర్యాదుదారుల నుండి 13 ఫిర్యాదులు స్వీకరణ:** వడ్డేపల్లి మండల ప్రజలకు గురువారం అందుబాటులో ఉంటానని రెండు రోజుల క్రితం పత్రికా ప్రకటన ద్వారా ఎస్పీ తెలియజేసినందున గురువారం పోలీస్ స్టేషన్ కు వచ్చిన 13 మంది ఫిర్యాదు దారుల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారితో స్వయంగా మాట్లాడి అట్టి ఫిర్యాదుల వివరాలను తెలుసుకున్నారు. ఫిర్యాదులలో భూ వివాదాలకు సంబందించి, చీటింగ్, చీట్ ఫాండ్స్ మోసాలు, భర్తల వేదింపులు, మిస్సింగ్ కేసులు, ప్లాట్ల కబ్జాలు, దౌర్జన్యంగా ఇతరుల ప్లాట్ లోకి వచ్చి బెదిరించుట ఫిర్యాదులు రాగ వచ్చిన ప్రతి ఫిర్యాదుపై పకడ్బందీగా విచారణ చేసివెంటనే చట్టప్రకారం పరిష్కరించాలని ఎస్సై, సిఐని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ కె.సత్యనారాయణ, శాంతినగర్‌సిఐరత్నం, శాంతినగర్‌ఎస్సై సంతోష్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి

- మోడీ క్యాబినెట్‌లో 27 మంది బిసి మంత్రులు
- మరోసారి మోడీనే ప్రధాని చేద్దాం.. డికె అరుణను గెలిపిద్దాం!
- మీడియా సమావేశంలో ఓబిసి మోక్ష రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరప్ప

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి28 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ క్యాబినెట్‌లో 27మందిబిసిమంత్రులు ఉన్నారని, బిసికమిషన్‌కు రాజ్యాధికార హోదా కల్పించిన ఘనత ప్రధానమంత్రికి భారతీయ జనతా పార్టీకే దక్కు తుందన్నారు. రూ. 20వేల కోట్లతో మత్స్య సంపద పథకం ద్వారా మత్స్యకారులకు సహకారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభు త్వం 3 వేల కోట్లతో గొర్రెల పెంపకానికి రుణ సహకారం అందిస్తుందని, చేతివృత్తుల వారి అభివృద్ధి కోసం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద 13 వేల కోట్ల రూపాయలు ఇవ్వడంతో30 లక్షల మందికి లబ్ది చేకూరిందన్నారు. ఇప్పటికి తెలంగాణలో రెండు లక్షల పైచిలుకు గృహ నిర్మాణాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు అందజేసినట్లు వెల్లడించారు. గరీబీ హటావో అని చెప్పుకొని అధికారాన్ని అనుభవించడం తప్ప పేదలకు చేసింది ఏమి లేది ఆరోపించారు. కానీ మోడీ 10 సంవత్సరాల పాలనలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాల డబ్బులను లబ్దిదారుల ఖాతాలో నేరుగా వేయడం జరుగుతుందన్నారు. దేశంలో 45కోట్ల మంది రైతులకు పంట సహాయం కింద సంవత్సరానికి 6 వేల నగదు రైతు ఖాతాల్లో వేస్తున్నది మోడీ ప్రభుత్వమని 22 రకాల పంటలకు కనీస మద్దతు ధరను రెట్టింపు చేసిన ఘనత మోడీకే దక్కుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పాలనలో బడుగు బలహీనవర్గాలతో పాటు మైనార్టీల అభవృద్ధికోసం మోడీ ప్రభుత్వంపని చేస్తుందని, మరొక్కసారి ప్రధానిగా మోడీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఆయన ప్రతినిధిగా మన పార్లమెంట్‌అభ్యర్థులకు ఓటేసి గెలిపించి మోడీకి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. సమావేశంలో ఓబిసి మోర్చా అధ్యక్షులు ప్రవీన్‌కుమార్ యాదవ్, ఓబిసి మోర్చా అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరుల రవికుమార్, ఓబిసి మోర్చా నాయకులు తరుణ్, బిజెపి పట్టణ అధ్యక్షులు నారాయణ యాదవ్, రాజేష్ కమలేకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

# భగవంతుని ఆశీర్వాదము అందరికి ఉండాలి

**మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**ఇఫ్తార్ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్**





ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, చల్లా వంశీచంద్‌రెడ్డి, కొత్వాల్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** భగవంతుని ఆశీర్వాదము మనందరిపై ఉండాలని, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం యునైటెడ్ ముస్లిం అడ్వైజరీ ఫోరం, కాస్మిక్ గ్రూప్ మహబూబ్‌నగర్ సంయుక్తంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన దావత్ ఇఫ్తార్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ అంటేనే ప్రేమకు గుర్తు అని, కుల మతాలకతీతంగా మనందరం సోదరభావంతో కలిసి మెలిసి జీవిద్దామని ఆయన ఆకాంక్షించారు. మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తు మహబూబ్‌నగర్ కోసం కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని ఆయన మైనార్టీ సోదరులను కోరారు. అనంతరం ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ నిత్య జీవన విధానంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కలిసి మెలిసిఎదుర్కొంటామని, హిందూ, ముస్లిం భాయ్ భాయ్ అనే అశయంతో జీవిద్దామనిఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గులాంగౌస్, అవేస్ బిన్ అహ్మద్, అజీం సలీం, ఖాలీద్‌నవీద్, మీర్ సోహెల్ అలీ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**గద్వాల ప్రతినిధి మార్చి 28 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి బి.యం సంతోష్ తెలియజేశారు. గురువారం గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎం.పి.డి.ఓ)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రములో 225 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు నిర్వహించడం జరిగిందని, పోలింగ్ కేంద్రంలో ఉదయం 10:00 గంటల వరకు 30.22% పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12:00 గంటలకు 43.11%, 2:00 గంటలకు 93.33% సాయంత్రం 4:00 గంటల వరకు 100శాతం పోలింగ్ అయినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ సరళిని జిల్లా అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు పరిశీలించారు.





## బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పతాంగే విశాల్

- మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు నియామకం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28, ప్రభాతవార్త:** బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంటరీ సోషల్ మీడియా కన్వీనర్‌గా పతాంగే విశాల్‌ను నియమించారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్‌కు చెందిన పతాంగే కొంతకాలంగా పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పార్టీకి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటు వస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా వ్యవహరిస్తుండడం, సమన్వయంతో ముందుకు సాగుతున్న పతాంగేను సోషల్ మీడియా పార్లమెంట్ కన్వీనర్‌గా నియమించడం యువ మోర్చా, సోషల్ మీడియా సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తన బాధ్యత మరింత పెరిగిందని, మున్ముందు పార్టీ అభ్యున్నతికి, పార్టీ పాలసీలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లేందుకు మరింత కృషి చేస్తానని విశాల్ తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గాల్లోని కన్వీనర్లతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామన్నారు.

## ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి

**స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ సుమన్**

**పోస్టర్ తయారీలో ఉత్సాహంగా పాల్గొన్న డైట్ కళాశాల విద్యార్థులు**





అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సంస్థ సభ్యులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ప్రభుత్వ డైట్ కళాశాలలో పోస్టర్ మేకింగ్ పోటీ నిర్వహించారు. ఓటరు చైతన్య కార్యక్రమంలో భాగంగా ప్రజలను చైతన్యపరచడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ప్రతి ఓటరు ఓటింగ్‌లో పాల్గొనేలా ఛాత్రోపాధ్యాయులు కృషి చేయలని అన్నారు. పోస్టర్ల ద్వారా ప్రజల్లో ఆసక్తికర అంశాలను వెలుగులోకి తీసుకురావచ్చని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణా ఎన్నికలసంఘం ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా స్వీప్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతీ వారందరూ కొత్త ఓటరుగా నమోదు కోసం కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు రూపొందించిన చార్టులను, పోస్టర్లను ఒక్కొక్కటిగా పరిశీలించి వారిలోని కళా ప్రతిభను కొనియాడారు. ఓటుహక్కు ప్రజల హక్కు, ఓటేసే బాధ్యత మనందరి బాధ్యత, ఓటరు చైతన్యం ప్రజాస్వామ్య ప్రభంజనం అనే సందేశాత్మక చిత్రాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డా. మహ్మద్ మెహరాజుల్లాఖాన్, వైస్ ప్రిన్సిపాల్ డా. షేక్ లియాక్ అలీ, సూపరింటెండెంట్‌రామకృష్ణారావు, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు

**పరిశీలించిన ఎన్నికల పరిశీలకురాలు వాణిప్రసాద్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి. రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 28 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ అనంతరం అన్ని పోలింగ్ కేంద్రాల నుండి సాయుధ పోలీస్ బందోబస్తుతో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రిని అందజేశారు. వాటిని పరిశీలన చేసి స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. రిసెప్షన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామాగ్రి, భద్రపరిచే ఏర్పాట్లు ఎన్నికల పరిశీలకులు వాణిప్రసాద్, రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్‌లు పర్యవేక్షణ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్స్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు, జిల్లా రిటర్నింగ్ అధికారి